వర్షాకాలంలోనూ నిశ్చింతగా..

- శరవేగంగా టపాతోపు అండర్‌పాస్ పైకప్పు పనులు
- మూడు మండలాలకు ప్రధాన మార్గం ఇదే..
- రైల్వేశాఖ ఆధ్వర్యంలో వేగంగా నిర్మాణం


పైకప్పుతో టపాతోపు అండర్‌పాస్


సింహభాగం పూర్తయిన టపాతోపు అండర్‌పాస్ పైకప్పు పనులు

కొడవలూరు: మండలంలోని టపాతోపు అండర్ పాస్‌లో వర్షాకాలంలోనూ నిశ్చింతగా వాహనాలు వెళ్లేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఇక్కడి అండర్ పాస్‌కు వర్షపునీరు లోపలికి రాకుండా ఇనుప రేకులతో పైకప్పు వేస్తున్నారు. టపాతోపు అండర్ పాస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలకు వెళ్లాలన్నా, ఆయా ప్రాంతాల నుంచి నెల్లూరుకు చేరుకోవాలన్నా కొడవలూరు రైల్వే గేటు ద్వారానే రావల్సి ఉండడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. మూడో రైల్వే లైన్ ఏర్పాటయ్యాక గేటు వేస్తే వాహనాలు బారులు తీరి నిలిచిపోతూ ఇబ్బంది పడుతుండేవారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని రైల్వే అధికారులు కొడవలూరు గేటుకు ప్రత్యామ్నాయంగా టపాతోపు రైల్వే గేటు వద్ద అండర్‌పాస్ నిర్మించారు. దీనివల్ల వాహనదారులకు ఎంతో ఉపశమనం కలిగింది. అయితే వర్షాకాలంలో అండర్ పాస్‌లో వర్షపు నీరు నిలుస్తుండడంతో ఆ సమయంలో సమస్య మళ్లీ మొదటికొచ్చేది. అండర్ పాస్‌లో నాలుగు నుంచి ఐదడుగుల వరకు వర్షపునీరు నిలిచి వాహన రాకపోకలు సాగేవి కాదు. వర్షాలు తగ్గి అండర్ పాస్‌లోని నీరు పూర్తిగా వెళ్లేవరకు వాహన రాకపోకలు నిలిపివేసేవారు. రూ.కోట్లు వెచ్చించి అండర్ పాస్ నిర్మించినా వర్షపు నీరు బయటకు వెళ్లే వెసులుబాటు లేనందున ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చేది. ఈ సమస్యను రైల్వే అధికారులు గుర్తించారు. అండర్ పాస్‌కు పైభాగాన రేకులతో పైకప్పు వేయడం ద్వారానే వర్షపు నీరు అండర్ పాస్‌లోనికి వెళ్లకుండా చేయగలమని రైల్వే అధికారులు నిర్ధారణకు వచ్చారు. రైల్వే శాఖ ద్వారా నిధుల వెసులుబాటు కూడా ఉండడంతో పనులు ప్రారంభించి శరవేగంగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పైకప్పు పనులు ఇప్పటికే 80 శాతం పూర్తవగా, మిగిలిన ఇరవై శాతం పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా వారు చర్యలు తీసుకొంటున్నారు. పైకప్పు నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలోనూ అండర్‌పాస్‌లో వాహనాలు నిశ్చింతగా వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది. అండర్‌పాస్‌లో వర్షపు నీరు నిలువకుండా పైకప్పు వేస్తుండడం పట్ల వాహనదారులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ఉపశమనం



టపాతోపు అండర్‌పాస్‌కు రేకులతో పైకప్పు వేయడం వల్ల వాహనదారులకు ఎంతో ఉపశమనం ఉంటుంది. వర్షాకాలంలో అండర్ పాస్‌లో వాహనాలు వెళ్లకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కొడవలూరు గేటు మీదుగానే రావల్సి ఉండడంతో ట్రాఫిక్ నిలిచిపోయి అత్యవసర పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని అండర్‌పాస్‌కు పైకప్పు వేయడం రైల్వే అధికారులు తీసుకున్న మంచి నిర్ణయం. దీనివల్ల ఎంతో మంది ప్రయాణికులకు మేలు జరుగుతుంది.

– కోవూరు వెంకీ, నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు, కొడవలూరు

ప్రయోజనకరం



టపాతోపు అండర్‌పాస్‌కు పైకప్పు వేయడం మూడు మండలాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. కొడవలూరుతో పాటు విడవలూరు, అల్లూరు మండలాల వారు వర్షాకాలంలో నెల్లూరుకు చేరుకోవాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి నిత్యం నెల్లూరు నగరానికి వెళ్లే వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. అండర్‌పాస్‌లో వర్షపు నీరుంటే కొడవలూరు గేటు వద్ద ట్రాఫిక్ స్తంభించి ఎంత సమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి ఉంటోంది. పైకప్పు వేయడం వల్ల వర్షాకాలంలోనూ అండర్‌పాస్‌లో సౌకర్యవంతంగా వెళ్లొచ్చు.

– కొప్పు రమేష్, కొడవలూరు

క్లుప్తంగా

రూ.3 లక్షల పరిహారమివ్వాలని డిమాండ్


సీఈ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

ముత్తుకూరు: ఏపీ జెన్‌కో యాష్‌పాండ్ కట్టలు తెగి పంట పొలాలను బూడిద ముంచెత్తిన ఘటనలో నష్టపోయిన రైతులకు త్వరగా నష్ట పరిహారం ఇవ్వాలని యాష్‌పాండ్ బాధితుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సభ్యులు గురువారం నేలటూరులోని జెన్‌కో సీఈ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది విజయ నిర్మల, కమిటీ కన్వీనర్ సుధాకర్, సభ్యులు గడ్డం అంకయ్య మాట్లాడుతూ ఎకరాకు రూ.3 లక్షలు, బాధిత కుటుంబాలకు రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. బాధితులను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో అవకతవకలున్నాయన్నారు. దీనిని సరిచేసి ఆదుకోవాలన్నారు.

సమరసత సేవా సమావేశం


మాట్లాడుతున్న సమరసత సేవా బాధ్యులు

పొదలకూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ అభ్యసన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో సత్సంగాలు, భజనలు, నగర హారతి, గ్రామ దర్శిని సమావేశాలు నిర్వహించాల్సిందిగా సూచించారు. ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రబోధక్ శేషు, ఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఈశ్వరయ్య, పరియోజన ప్రముఖ్ రాంబాబు, జోనల్ ప్రచారక్ వెంగళరెడ్డి, బాబా మందిర కమిటీ సభ్యులు దామోదర్‌రావు, లక్కాకుల ఆనంద్‌రావు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు అక్షర విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుముద, కోచ్ సుమన్


వెంకటాచలం: తమిళనాడులోని పుదుచ్చేరిలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు జరిగే సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ అండర్-11, 14, 17, 19 చెస్ పోటీలకు వెంకటాచలం మండలం సరస్వతీ నగర్‌లోని అక్షర విద్యాలయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విభాగంలో నలుగురు చొప్పున మొత్తం 16 మంది ఎంపికవగా వారిని అక్షర విద్యాలయ డైరెక్టర్ కుముద, కోచ్ సుమన్ గురువారం అభినందించారు.

సమగ్ర శిక్ష పరిశీలకుల పర్యటన


హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్న కల్పన

ముత్తుకూరు: ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్' ఫలితాలను సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు కల్పన శైల గురువారం సమీక్షించారు. మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో చదువులో వెనుకబడిన విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా ఏ విధంగా అభివృద్ధి చెందారన్న అంశాన్ని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. బోధన వ్యూహం అమలయ్యే విధానాన్ని ఆరాతీశారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో బాలరక్ష భారత్ ప్రతినిధి రఫీ, జిల్లా ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓలు హేమసుందర్, మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో రైతులకు సబ్సిడీపై నవధాన్య విత్తనాలను గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 శాతం రాయితీతో జీలుగ, పిల్లిపెసర, జనుము, మినుము, పెసర, అలసంద, మొక్కజొన్న, జొన్న విత్తనాలను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఏఓ వాసు, నాయకులు మస్తాన్‌బాబు, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో శరన్నవరాత్రులకు సంబంధించి వివిధ పనులకు శుక్రవారం వేలం పాట జరుగనున్నాయి. ఈ మేరకు జొన్నవాడలోని దేవస్థానంలో ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో శరన్నవరాత్రులు జరుగుతాయని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం విద్యుద్దీపాలంకరణ, స్టేజ్, పందిళ్ల ఏర్పాటు తదితర పనులకు ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు శుక్రవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

సూరాయపాళెం ఇసుక రీచ్ పరిశీలన

పొదలకూరు: మండలంలోని సూరాయపాళెం ఇసుక రీచ్‌ను సర్వేపల్లి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, వంశీ, జనసేన నాయకులు కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియా సమావేశం నిర్వహించారు. సూరాయపాళెం రీచ్ నుంచి డ్రెడ్జింగ్ పద్ధతిలో టన్నుకు రూ.128.60 లెక్కన ఇసుకను వెలికి తీస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సర్వేపల్లి నియోజకవర్గంలోనే తక్కువ ధరకు వెలికి తీసి యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు. తాము ఇక్కడ రూ.100 కోట్లు సంపాదించుకునేందుకు స్కెచ్ వేసినట్లు మాజీ మంత్రి కాకాణి చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కాకాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వద్దు

- మెప్మా పీడీ రవీంద్ర


మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పేదల ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెప్మా పీడీ రవీంద్ర అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై మండలాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పీడీ మాట్లాడుతూ లబ్ధిదారులతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కొత్తగా ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ వెంటనే వాటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా అలసత్వం వహిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కాలనీల్లో నీటివసతి, విద్యుత్ లైన్ల ఏర్పాటు తదితర సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం


ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : ఉద్యాన పంటలకు ఉపాధి హామీ ద్వారా ప్రోత్సాహమిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని మానేగుంటపాడులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సొంత భూమి ఉంటే కొబ్బరి, పండ్ల మొక్కలను ఉచితంగానే పంపిణీ చేస్తామన్నారు. తద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ వంద రోజుల పనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కాలువల పూడికతీత పనుల వల్ల కూలీలకు ఉపాధి లభ్యమవ్వడంతో పాటు కాలువలు బాగు పడి రైతులకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఎంపీడీఓ వెంట టీఏ రియాజ్ ఎఫ్ఏ విశ్వనాథ్‌లు ఉన్నారు.

శబరిమలకు బియ్యం, వంట సామగ్రి


వాహనానికి పచ్చజెండా ఊపుతున్న దృశ్యం

ముత్తుకూరు: శబరిమల సన్నిధానంలో అన్నదానం కోసం బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర వంట సామగ్రి తరలించే వాహనాన్ని ముత్తుకూరులో గురువారం గొలగమూడి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఈదూరు రామమోహన్‌రెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల ఆకలి తీర్చేందుకు తలపెట్టిన ఈ కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం ప్రధాన కార్యదర్శి మేకల వెంకయ్య పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య


మనుబోలు: గమళ్లపాళెం బొజ్జ గణపయ్య గ్రామోత్సవం

మనుబోలు: వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రమైన మనుబోలులో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాల నిమజ్జనోత్సవం కొనసాగుతోంది. మండపాల వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఆర్చిలు ఆకట్టుకుంటున్నాయి. గణేశ్ విగ్రహాలకు నిత్యం పూజలు చేస్తున్నారు. గురువారం మనుబోలులోని వివిధ మండపాల్లోని విగ్రహాలకు అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించి గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. గమళ్లపాళెం మండపం వద్ద లడ్డూను వేలంలో రూ.52 వేలకు కుడమల జయకుమార్, రావుల మోహన్‌రావు, నగదు మాలను రూ.23 వేలకు కోనూరు కిరణ్ దక్కించుకున్నారు. ఉత్సవాల వెంట తీన్‌మార్ బ్యాండ్, డీజే ఏర్పాటు చేయగా యువత సందడి చేసింది.

రామనగర్‌గేటు సెంటర్‌లో

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో గురువారం గణేశ్ లడ్డూ వేలం పాట రికార్డు స్థాయిలో జరిగింది. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి లడ్డూను రూ.2.50 లక్షలకు దక్కించుకున్నారు. స్వామికి వేసిన రూ.100 మాలను రూ.18 వేలకు శ్రీనివాసులునాయుడు, రూ.50 మాలను రూ.24 వేలకు విశ్వరూపాచారి, రూ.20 మాలను రూ.28 వేలకు ఎస్‌కే మస్తాన్, గణపతి చిన్న విగ్రహాన్ని రూ.86 వేలకు అరిక శ్రీనివాసులురెడ్డి వేలం పాటలో దక్కించుకున్నారు.

ఏచూరి మరణం తీరనిలోటు

- మాజీ మంత్రి కాకాణి

పొదలకూరు : సీపీఎం నాయకుడు సీతారామ్ ఏచూరి మరణం దేశానికి తీరని లోటని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నిరాడంబరుడు, పేదల పక్షపాతి, ప్రజల సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడు సీతారామ్ ఏచూరిని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

స్టాఫ్ నర్సుల నిరసన



కోవూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద స్టాఫ్ నర్సులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు జయలక్ష్మి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

కోవూరు : కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీసీజీ వ్యాక్సినేషన్‌పై ఆరాతీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిరంజన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

320 మంది విద్యార్థులకు పురస్కారాలు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో ఇంటర్నేషనల్ హెల్పింగ్ ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకుడు డాక్టర్ గంగపట్నం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 320 మంది విద్యార్థులకు రూ.3.35 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని గురువారం అందజేశారు. గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజు, జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : భార్యపై అలిగి ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఫత్తేఖాన్‌పేటకు చెందిన మనోహర్‌లాల్ నగరంలోని ఓ షాపింగ్ మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అతని క్రెడిట్ కార్డును భార్య పూర్ణిమ వాడుకున్నారు. ఈ విషయమై భార్యాభర్తల నడుమ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 11వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి జాడ తెలియరాలేదు. ఈ మేరకు పూర్ణిమ గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఎన్.మునికృష్ణయ్య మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి కాకాణి పరామర్శ


మునెయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మిరెడ్డి మధుసూదన్ రెడ్డి పెదనాన్న బొమ్మిరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం మృతిచెందారు. దీంతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం మనుబోలుకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసులురెడ్డి కుమారులు వెంకటరమణారెడ్డి, రామసుబ్బారెడ్డి, సోదరుడు శంకర్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. పిడూరు గ్రామంలో మాజీ సర్పంచ్ చెంచు మునెయ్య గుండెపోటుతో మరణించడంతో కాకాణి వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో మన్నెమాల సాయి మోహన్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గిద్దంటి రమణయ్య, కోసూరు కోటేశ్వరగౌడ్, మోహన్‌రెడ్డి, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర జీవనం


విడవలూరు: రామచంద్రాపురంలో..

కొడవలూరు : పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని కొత్తవంగల్లు గాంధీ సంఘంలో గర్భిణులు, బాలింతలకు పోషక విలువలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పోషక పదార్థాలను ప్రదర్శించి మాట్లాడారు. పోషక విలువలున్న ఆహారంపై సరైన అవగాహన లేకపోవడం వల్లే పోషకాహార లోపం తలెత్తి రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. తక్కువ ధరకు ఎక్కువ పోషకాలు లభ్యమయ్యే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లీలయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు అందించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని అంగన్‌వాడీ కార్యకర్త రాజమ్మ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని ఏడో వార్డు ఖాజానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం జరిగాయి. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే బాలామృతం, పాలు, గుడ్లను చిన్నారులకు ప్రతిరోజు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు సుస్మిత, సుమలత, ఏఎన్‌ఎం కవిత పాల్గొన్నారు.

రోజూ తీసుకోవాలి

విడవలూరు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ బి.రమణి అన్నారు. మండలంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి ఆహారాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వారికి పౌష్టికాహార కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిశేషమ్మ, మంగమ్మ, మాధవి, గంగమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


కొడవలూరు : పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఏడో వార్డులో..